సాక్షి అనంతపురం

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

36.5°/16.2°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

నేడు సిద్ధం

దారులన్నీ రాప్తాడు వైపే!



రాప్తాడు ఆటోనగర్ వద్ద సర్వాంగ సుందరంగా ముస్తాబైన సిద్ధం సభా ప్రాంగణం

- నేడు జిల్లాకు సీఎం వైఎస్ జగన్
- 'సిద్ధం' సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- రాప్తాడు ఆటోనగర్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- సీమ నలుమూలల నుంచి భారీగా తరలిరానున్న జనం
- సమరోత్సాహంలో వైఎస్సార్ సీపీ కేడర్

సాక్షి ప్రతినిధి, అనంతపురం/రాప్తాడు: రాప్తాడు ఆటోనగర్ వద్ద ఆదివారం జరగనున్న 'సిద్ధం' సభకు సర్వం సిద్ధమైంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సభా వేదికపై నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఎన్నికలపై కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు.

సీఎం ప్రసంగంపైనే అందరి దృష్టి

'చెప్పింది చేశాం, చెప్పనివీ చేశాం, మీకు మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండి' అంటూ చరిత్రలో తొలిసారి చెప్పింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే. ఇప్పటికే రాష్ట్రంలో 95 శాతం మందికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధి కలిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాది మందికి సంక్షేమ ఫలాలు అందాయి. ఈ క్రమంలోనే రాప్తాడులో వైఎస్సార్ సీపీ 'సిద్ధం' నిర్వహిస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే విశాఖపట్నం జిల్లా భీమిలి, పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో నిర్వహించిన 'సిద్ధం' సభలకు జనం పోటెత్తారు. సంక్షేమ సారథికి జై కొట్టారు. ఆ రెండు సభల కంటే మిన్నగా 'రాప్తాడు'కు జనం రానున్నట్లు అంచనా వేస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించి కూడా సీఎం వైఎస్ జగన్ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని ఇప్పటికే మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్న నేపథ్యంలో ప్రజలతో పాటు ప్రతిపక్ష నేతలు కూడా ఆదివారం రాప్తాడు ఆటోనగర్ వద్ద జరిగే సభ వైపు దృష్టి సారించారు.

కేడర్‌కు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు..

'సిద్ధం' సభకు రాయలసీమ జిల్లాలు (ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, చిత్తూరు, అనంతపురం) నుంచి లక్షలాది మంది తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా 110 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో సభా వేదికతో పాటు పదుల సంఖ్యలో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రసంగం అనంతరం సీఎం వైఎస్ జగన్ 'వాక్ వే' ద్వారా పార్టీ కేడర్ దగ్గరకు వెళ్లి ప్రత్యేకంగా పలకరించడానికి వీలుగా ర్యాంప్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు పూర్తిస్థాయిలో హాజరుకానున్న నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు 10 రోజులుగా ఏర్పాట్లను నిత్యం పర్యవేక్షించారు. శనివారం కూడా మంత్రి పెద్దిరెడ్డి, తలశిలతో పాటు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివా రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ పరిశీలించారు. సిద్ధం సభ మ్యాప్ విడుదల చేశారు.

ఆకర్షణీయంగా ఫ్లెక్సీలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు కూడా 'సిద్ధ'మయ్యారు. సభ వద్ద భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులను వైఎస్సార్ సీపీ జెండాలతో ముంచెత్తారు. చాలా చోట్ల భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. వేదికకు నాలుగు వైపులా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు, మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



సభా స్థలి వద్ద ఆకట్టుకుంటున్న 'ఫ్యాన్' కటౌట్

భారీ వాహనాలపై మాత్రమే ఆంక్షలు

అనంతపురం: సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో భారీ వాహనాలకు మాత్రమే ఆంక్షలు విధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాసింజర్, కార్లు, అత్యవసర వాహనాలు తదితర అన్ని రకాల వాహనాలకు ఎలాంటి ఆంక్షలు వర్తించవన్నారు. యథావిధిగా అనంతపురం మీదుగా హైవే-44 పై వెళ్లవచ్చని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు మాత్రమే మళ్లింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

- బెంగళూరు నుంచి అనంతపురం మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలను మామిళ్లపల్లి వద్ద మళ్లిస్తారు. మామిళ్లపల్లి నుంచి కనగానపల్లి, నూతిమడుగు, కళ్యాణదుర్గం, అనంతపురం మీదుగా జాతీయ రహదారి-44పై వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి అనంతపురం మీదుగా బెంగళూరు వైపు వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలను అనంతపురం రూరల్ సోములదొడ్డి జాతీయ రహదారి-44 వద్ద మళ్లిస్తారు. సోములదొడ్డి, తడకలేరు, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, బుక్కరాయ సముద్రం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, మామిళ్లపల్లి మీదుగా వెళ్లాలి.
- చెన్నై, కదిరి వైపు నుంచి పంగల్ రోడ్డు మీదుగా జాతీయ రహదారి-44పై హైదరాబాద్ వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలు బత్తలపల్లి వద్ద మళ్లిస్తారు. బత్తలపల్లి నుంచి నార్పల, బుక్కరాయసముద్రం, ఎన్టీఆర్ మార్గ్, గుత్తిరోడ్డు, తడకలేరు, సోములదొడ్డి వద్ద జాతీయ రహదారి-44 మీదుగా వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి అనంతపురం మీదుగా కదిరి, చెన్నై వైపు వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలు సోములదొడ్డి వద్ద మళ్లిస్తారు. సోములదొడ్డి నుంచి తడకలేరు, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- ప్రజలు, వాహనచోదకులు అసౌకర్యానికి గురికాకుండా మళ్లింపు ఆంక్షలు భారీ గూడ్స్ వాహనాలకు మాత్రమే పరిమితం చేశామని, పోలీసులకు సహకరించాలని ఎస్పీ అన్బురాజన్ విజ్ఞప్తి చేశారు.

సీఎం పర్యటన సాగేదిలా..

అనంతపురం ఎడ్యుకేషన్: సీఎం వైఎస్ జగన్ పర్యటన వివరాలను ఉన్నతాధికారులు శనివారం తెలియజేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 2.55 గంటలకు బయలుదేరి 3.15 గంటలకు రాప్తాడు వస్తారు. 3.20 గంటలకు హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 3.30 నుంచి 5 గంటల వరకూ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం 5.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 5.35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 5.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు. 6.30 గంటలకు అక్కడికి చేరుకుని 6.55 గంటలకు తన నివాసానికి చేరుకుంటారు.

కట్టుదిట్టమైన భద్రత



సభా వేదికను పరిశీలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

రాప్తాడు: సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. శనివారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆధ్వర్యంలో సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఎక్కడా చిన్న తప్పిదం జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని వారు ఆదేశించారు. సీఎం వచ్చి వెళ్లేంత వరకూ అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎస్పీ జాషువా పాల్గొన్నారు.



బైకు, హెల్మెట్‌కు వైఎస్సార్ సీపీ రంగులు, సీఎం జగన్ పలు సందర్భాల్లో ఇచ్చిన నినాదాలతో స్టిక్కర్లు వేసుకుని ఆకట్టుకుంటున్న అమర్‌నాథ్ రెడ్డి







నేషనల్ హైవేపై రెపరెపలాడుతున్న వైఎస్సార్‌సీపీ జెండాలు, సిద్ధం సభ మ్యాప్ విడుదల చేస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి తదితరులు, సీఎం సభకు ఇప్పటికే చేరుకున్న శ్రేణుల వాహనాలతో కిక్కిరిసిన పార్కింగ్ స్థలం

కొండపైకి ఉత్సవ విగ్రహాలు



పల్లకీలో కొండమీదరాయుడి ఊరేగింపు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొండమీదరాయుని బ్రహ్మోత్సవాల్లో శనివారం సాయంత్రం వేంకటరమణస్వామి దేవాలయంలోని శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి, ఈఓ బాబు హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం పల్లకీలో ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి పుర వీధులలో ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ దేవర కొండపైకి విగ్రహాలను చేర్చారు. ఆదివారం ఉదయం దేవర కొండపై హోమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

సీఎం జగన్ ప్రసంగంపై రాష్ట్రమంతా దృష్టి

- మళ్లీ వైఎస్సార్ సీపీ జయకేతనం ఖాయం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడు 'సిద్ధం' సభపై రాష్ట్రమంతా దృష్టి సారించిందని, సభలో సీఎం ఏం మాట్లాడబోతున్నారో, వచ్చే ఐదేళ్లు ఏం చేయబోతున్నానని ప్రకటిస్తారో అనే ఉత్కంఠతతో ప్రజానీకమంతా ఎదురు చూస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రాప్తాడు సభ చరిత్రలో నిలిచిపోనుందన్నారు. ఈసారి కూడా రాయలసీమలో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'సిద్ధం సభలతో ఇప్పటికే భీమిలిలో భయపెట్టాం, దెందులూరులో దడ పుట్టించాం, రాప్తాడు సభతో ప్రతిపక్షాలను రప్ఫాడిస్తామని' చెప్పారు. జగనన్న మళ్లీ వస్తేనే తమకు మేలు జరుగుతుందనే భావన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద, బడుగు బలహీన వర్గాల్లో నెలకొందన్నారు. సభకు తండోపతండాలుగా వచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు. ఆయన ప్రసంగం తర్వాత జగనన్న సైనికులు కదనరంగంలోకి దూకుతారన్నారు. ఎన్నికలయ్యేంత వరకు అదే ఊపుతో పని చేస్తారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదగకుండా టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుట్రలు పన్ని జైలుకు పంపారని అన్నారు. అయితే బంతిని నేలకు కొడితే ఎంతవేగంగా పైకి వస్తుందో అంతేవేగంగా జగనన్న జనంలోకి వచ్చారన్నారు. ఓటమికి నిరాశ చెందకుండా ప్రజలతోనే ఉండి పాదయాత్ర చేసి నవరత్నాల మేనిఫెస్టోను ప్రకటించి అధికారంలోకి వచ్చారన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి 99 శాతానికి పైగా హామీలు అమలు చేశారన్నారు. ఈ విషయంలో ఆయన దేశానికే ఆదర్శమన్నారు. 'సిద్ధం' సభ రాప్తాడులో నిర్వహించడం గర్వకారణమన్నారు. నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ సిద్ధం సభలను చూసి చంద్రబాబు, లోకేష్, జనసేన నాయకులకు దడ పుట్టుకొచ్చిందన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ గెలిచే ప్రసక్తే లేదన్నారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబం ఒక సారి మాట ఇస్తే మడమ తిప్పదన్నారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్నోబులేసు, నాగేశ్వర్‌రెడ్డి, గొర్రెలు, మేకల ఫెడరేషన్ చైర్మన్ నరసింహగౌడ్, రంగంపేట గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఈరలక్కప్ప, మహాలక్ష్మి

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అనంతపురం అర్బన్: జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా ఉన్న జె.రవీంద్రను పీబీసీ (వైఎస్సార్ జిల్లా) ఎస్‌డీసీగా నియమించారు. డిప్యూటీ కలెక్టర్ జి.శంకరయ్య ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి (ఎఫ్‌ఎస్ఓ)గా నియమితులయ్యారు. ఇక్కడ ఉన్న ఎస్.సీలమయ్యను వైఎస్సార్ జిల్లా జీఎన్ఎస్ఎస్ యూనిట్ టూ ఎస్‌డీసీ (ఎల్‌ఏ)గా బదిలీ చేశారు.

KALYANDURGAM MUNICIPALITY

Tender Notice (Expression of Interest)

The Commissioner, Kalyandurgam Municipality invites sealed quotations to Structural Design and Drawings for the Building, Preparation of Cross Section and Elevation and Preparation of Floor Plan Estimations and Approvals (Detail Project Report) for **Newly Construction of Municipal Shopping Complex in Sy. No. 372-2A-2 at Bellary Mitta in Kalyandurgam Municipality.** The Interested firms having experience in the designs of Building to under take the above scope of work. The sealed quotations should reach this office along with relevant documents for above said work.

Last date of Submission of application : 19-02-2024 at 10-00 AM
Last date of Receipt of bids : 26-02-2024 at 4-00 PM
Opening of Bids : 26-02-2024 at 4-30 PM

Box Tender Notice

Name of scheme	MPLADS
No. of Works	1 Nos
Works	Bus Shelter
Total Estimated Amount	0.99 lak
Start Date of Tender and Time	20-02-2024 10-00 AM
End Date and Time	27-02-2024 4-30 PM
Opening of Bids	27-02-2024 5-00 PM
Name and Address of Concerned Officer	Municipal Commissioner, Kalyanadurgam Municipality, Kalyanadurgam. (Further Details can be obtained from Office Notice Board)

Sd/- B.V. Narasa Reddy, Municipal Commissioner, Kalyandurgam Municipality

- ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ
- ఈసీఈ విభాగంలో ముగిసిన ఐఓటీ హ్యాకథాన్ సదస్సు

సమాజహిత పరిశోధనలపై దృష్టి

అనంతపురం: సమాజహితమైన పరిశోధనలపై దృష్టి సారించాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. ఈసీఈ విభాగం, మేక్‌స్కిల్డ్ ఇన్నోవేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్) హ్యాకథాన్ ముగింపు సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సు కోఆర్డినేటర్లు డాక్టర్ జి.మమత, డాక్టర్ డి.విష్ణువర్ధన్ అధ్యక్షతన హ్యాకథాన్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో పోటీపడేలా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. హ్యాకథాన్‌లో విద్యార్థుల పరిశోధన ప్రాజెక్ట్‌లు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, ప్రొఫెసర్ రమణా రెడ్డి, మాజీ ప్రొఫెసర్ ఎం.ఎస్.గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఓటీతో స్మార్ట్ పార్కింగ్ విధానం

ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ)తో స్మార్ట్ పార్కింగ్ విధానంపై నిర్వహించిన ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి దక్కింది. ఈసీఈ విభాగానికి చెందిన జి.హరిణి, సంతోష్, టి.సుప్రియ, వేదవతి, సాహితీరెడ్డి, నిరోషా ఐఓటీ స్మార్ట్ పార్కింగ్ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. ఏదైనా షాపింగ్, సినిమా మాల్ పరిసరాల్లో కార్లు పార్కింగ్ చేసే స్థలం లేకపోతే ఐఓటీ స్మార్ట్ పార్కింగ్ అనుమతించదు. లోపలికి వెళ్లడానికి వీల్లేదని హెచ్చరిక జారీ చేస్తుంది. నిర్దేశిత ప్రాంతంలోనే కార్లు అనుమతించాలని స్పష్టం చేస్తుంది. దీంతో కార్లు పార్కింగ్ చేయడానికి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ప్రత్యామ్నాయం పార్కింగ్ వైపు వెళ్లడానికి ఆస్కారం ఏర్పడుతుంది. సీప్లస్, ప్లస్ సాఫ్ట్‌వేర్, ఐఓటీతో స్మార్ట్ పార్కింగ్ విధానాన్ని ఆవిష్కరించారు.



మొదటి బహుమతి పొందిన విద్యార్థులను అభినందిస్తున్న సదస్సు కోఆర్డినేటర్లు మమత, విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి

ఇంటి నుంచే వైద్యం పొందే వీలు

ఇంటి నుంచి కానీ, ఏదైనా కార్యాలయంలో కానీ వైద్యం అత్యవసరమైతే నేరుగా డాక్టర్లకు అనుసంధానం చేసే వ్యవస్థ ఐఓటీ బేస్డ్ పేషెంట్ మానిటరింగ్ సిస్టమ్. ఈసీఈ విద్యార్థులు శశాంక్, ధన్య, అక్షయ, ఈక్షిత, లావణ్య రూపకల్పన చేసిన ఈ ప్రాజెక్ట్‌కు రెండో బహుమతి దక్కింది. ఏదైనా వైద్యం అవసరమయినపుడు నేరుగా డాక్టర్‌కు సమాచారం అందించి మెడిసిన్ అందించే విధంగా ఈ ప్రాజెక్ట్ తయారు చేశారు. పల్స్ రేటు తగ్గినా, ఆక్సిజన్ తగ్గినా వెంటనే డయల్ 100కు, డాక్టర్‌కు సమాచారం అందుతుంది.



అగ్ని ప్రమాదాన్ని ముందే నివారించే పరిశోధన

వేర్‌హౌస్, పెద్ద పెద్ద గిడ్డంగిల్లో విలువైన వస్తువులు నిల్వ చేసి ఉంటారు. ఇందులో అగ్ని ప్రమాదం జరిగితే జరిగే నష్టం చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలో ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్) ద్వారా అగ్ని ప్రమాదాన్ని పసిగట్టి ముందే నివారించవచ్చు. ఒకవేళ అప్రమత్తంగా లేకపోతే అగ్ని ప్రమాదం నుంచి నష్టాన్ని తగ్గించే ఆవిష్కరణ చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్న అక్కం రాజు ఆదిత్య, షేక్ నఫీజ్ తాజ్, దండు యోగామృత, ఫఖాలి మహమ్మద్ ఫయాజ్, కుడం మానస అనే విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్ట్‌కు మూడో స్థానం దక్కింది.



ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము , డి.నెం.6-3-145, రెవిన్యూ వార్డునెం.6, రాంనగర్, అనంతపురము- 515004, ఫోన్: 08554-226066, ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా మెస్సర్స్ ఎస్.వి. మైన్స్ & మినరల్స్ వారు అనంతపురము జిల్లా, పెద్దవడుగూరు మండలం, క్రిష్టిపాడు గ్రామంలో సర్వేనెం.333,334,335 & 336-1/బి నందు 1.037 హెక్టార్ల విస్తీర్ణంలో స్టీటైట్ & డోలొమైట్ మైను స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1. కంపెనీ పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెం.	మెస్సర్స్ ఎస్.వి.మైన్స్ & మినరల్స్, సర్వేనెం.333, 334,335 & 336-1/బి క్రిష్టిపాడు గ్రామం, పెద్దవడుగూరు మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్
2. ప్రతిపాదిత స్థాపన ప్రదేశం సర్వేనెంబర్లతో సహా & భూమి విస్తీర్ణం	సర్వేనెం.333, 334,335 & 336-1/బి, క్రిష్టిపాడు గ్రామం, పెద్దవడుగూరు మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు మొత్తం మైను లీజు ఏరియా 1.037 హెక్టార్లు
3. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు	మెస్సర్స్ ఎస్.వి.మైన్స్ & మినరల్స్ మేనేజింగ్ పార్టనర్ శ్రీ రావి శ్రీనివాస్ చౌదరి, ఫ్లాట్ నెం.102, రాజహంస ప్యాలెస్,షిరిడినగర్, అనంతపురము - 520010, ఫోన్: 7569588698
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.30.00 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	స్టీటైట్ - 3240 టిపిఏ డోలొమైట్ -2592 టిపిఏ మైనింగ్ కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 20.03.2024 సమయం : ఉ.11.00 గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, క్రిష్టిపాడు గ్రామం, పెద్దవడుగూరు మండలం అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ REIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.
ఎ) కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము జిల్లా, అనంతపురము
బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము జిల్లా, అనంతపురము
సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము
ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010
ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, అనంతపురము జిల్లా
జి) తహశీల్దార్ వారి కార్యాలయము, పెద్దవడుగూరు మండలం, అనంతపురము జిల్లా
హెచ్) గ్రామ పంచాయతీ కార్యాలయము, క్రిష్టిపాడు గ్రామం, పెద్దవడుగూరు మండలం, అనంతపురము జిల్లా

ఈ విస్తరణ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క వరుస నెం.7III(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అట్టివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహించబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును.

సం/-
పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

ప్రదేశం : అనంతపురము
తేది : 18.02.2024

కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగర పాలక కమిషనర్ వై.మేఘ స్వరూప్‌తో కలిసి శనివారం జేఎన్‌టీయూ కళాశాలను ఆమె సందర్శించారు. ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్న గదులు, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఫెన్సింగ్, సీటింగ్, ఇతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. నియోజకవర్గాల వారీగా రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, ఇతర అధికారులు ఉన్నారు.

ఎన్నికలకు నిర్వహణకు 17 కమిటీలు

సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఈ క్రమంలోనే ఎన్నికల నిర్వహణకు 17 కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలకు నోడల్ అధికారులను నియమించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆదేశించారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ కమిటీ నోడల్ అధికారులుగా జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి (ఎన్ఐసీ)ని నియమించారు. అలాగే, ఈవీఎం మేనేజ్‌మెంట్- వై.మేఘస్వరూప్, (నగరపాలక కమిషనర్), ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ - ఎం.వీర్రాజు(డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్), ట్రైనింగ్ మేనేజ్‌మెంట్-బి.రఘునాథ్‌రెడ్డి(ఉద్యానశాఖ అధికారి), కుష్బూకొఠారి (బీసీ సంక్షేమాధికారి) ఎస్.అప్పిరాజు (చేనేత జౌళి శాఖ అధికారి), మెటీరియల్ మేనేజ్‌మెంట్-ఎస్.మధుసూదన్‌రావు (జేడీ, సాంఘిక సంక్షేమ శాఖ), పి.సత్యనారాయణ చౌదరి (మార్కెటింగ్ అధికారి), ఎంసీసీ అమలు-వైఖోమ్ నిదియాదేవి (జెడ్పీ సీఈఓ), ఉమామహేశ్వరమ్మ (డీఏఓ), సూపరింటెండెంట్(మెజిస్టీరియల్ విభాగం, కలెక్టరేట్), హెల్ప్‌లైన్- శ్రీనివాసనాయక్ (డీడీ మత్స్యశాఖ), ప్రభాకర్‌రెడ్డి (ఈఈ డ్వామా క్వాలిటీ కంట్రోల్), సామగ్రి పర్యవేక్షణ వై.ఇందిర (ఆడిట్ అధికారి), జిల్లా కో-ఆపరేటివ్ అధికారి, పరిశీలకులుగా కళ్యాణ చక్రవర్తి(అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్), పి.వి.కిషోర్‌రెడ్డి (ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి), జయకుమార్‌బాబు, (ఏపీడీ, డ్వామా), శాంతిభద్రతలు-అదనపు ఎస్పీ, బ్యాలెట్ పేపర్ కె.ఎల్.ప్రభాకర్‌రావు (జిల్లా పంచాయతీ అధికారి), మీడియా- గురుస్వామి శెట్టి (డీఐపీఆర్‌ఓ, సమాచార శాఖ), కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ- బి.రవికుమార్(డీఐఓ, ఎన్ఐసీ), ఆనంద్‌రాజ్‌కుమార్ (జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి), స్వీప్ (ఎస్వీఈఈపీ)- లలిత(జెడ్పీ డిప్యూటీ సీఈఓ), పి.నరసింహారెడ్డి (జిల్లా క్రీడాభివృద్ధి అధికారి), ఓటర్ హెల్ప్‌లైన్ (1950)- కె.మల్లికార్జునప్ప(ఈఈ టిడ్కో), వై.నాగయ్య (జిల్లా గనుల శాఖ అధికారి), కనీస వసతుల కల్పన- ఎస్ఈ(పంచాయతీరాజ్ శాఖ), కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు- ఎస్.ఓబుళరెడ్డి (ఎస్ఈ, ఆర్అండ్‌బీ)ని నియమించారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ అన్బురాజన్, జేసీ కేతన్‌గార్గ్

ఏపీ ఐసెట్ కన్వీనర్ బాధ్యతల స్వీకరణ



ఏపీ ఐసెట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, చిత్రంలో రిజిస్ట్రార్ లక్ష్మయ్య, రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ

అనంతపురం: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఐసెట్ (ఏపీ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)-2024 నిర్వహణ బాధ్యత శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. ఏపీ ఐసెట్ రాష్ట్ర చైర్మన్‌గా ఎస్కేయూ వీసీ కె.హుస్సేన్‌రెడ్డి, కన్వీనర్‌గా పి.మురళీకృష్ణ (ఎంబీఏ విభాగం)లను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఎస్కేయూ క్యాంపస్‌లో ఏపీ ఐసెట్ రాష్ట్ర కార్యాలయాన్ని ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్యతో కలిసి వీసీ హుస్సేన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ఏపీ ఐసెట్ కన్వీనర్ మురళీకృష్ణ బాధ్యతలు తీసుకున్నారు. గతేడాది కూడా ఐసెట్ బాధ్యత ఎస్కేయూకు లభించింది. తాజాగా రెండోదఫా ఏపీ ఐసెట్ నిర్వహణ బాధ్యతను ఎస్కేయూకే అప్పగించారు. ఏపీ ఐసెట్ నిర్వహణ కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్ పీవీ రమణ (కెమిస్ట్రీ), ప్రొఫెసర్ టి.భాస్కర్‌రెడ్డి (కంప్యూటర్ సైన్సెస్), ప్రొఫెసర్ డి.ప్రభాకర్ (ఎంబీఏ విభాగం)లను నియమించారు.

రైల్లో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

గుత్తి: మధ్యప్రదేశ్‌కు చెందిన రైలు ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడు. గుత్తి సమీపంలో ఈ ఘటన జరిగింది. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు... మధ్యప్రదేశ్‌కు చెందిన మనోజ్‌సింగ్ (40) కుటుంబ సభ్యులతో కలిసి లక్నో ఎక్స్‌ప్రెస్ రైల్లో పుట్టపర్తికి బయల్దేరాడు. గుత్తి సమీపంలోకి రాగానే మనోజ్‌సింగ్ ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలి కిందపడ్డాడు. గుత్తి రైల్వే స్టేషన్‌లో అతడిని కిందకు దింపి రైల్వే ఆస్పత్రి వైద్యులు పరీక్షించారు. అయితే అప్పటికే మనోజ్‌సింగ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. జీఆర్‌పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

రైలులో ప్రయాణికుడు మనోజ్‌సింగ్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి రైల్వే ఉద్యోగులు, కార్మికులు అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. చందాలు వేసుకుని రూ.70వేల నగదును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంబులెన్స్ సమకూర్చి మృతదేహాన్ని మధ్యప్రదేశ్‌కు తరలించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆర్థిక భరోసా

కూడేరు: ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చోళసముద్రంలో రైతులు పెన్నోబులేసు, భీమలింగ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన మామిడి, జామ, నేరేడు, వేరుశనగ, మునగ, కడదరకుంటలో రైతు శంకరయ్య పొలంలో చీనీ, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, ఆకుకూరలు, మొక్క జొన్న పంటలను ఆయన శనివారం పరిశీలించారు. పంటల సాగు, రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడితో పలు రకాల పంటలు సాగు చేసుచేస్తున్నామని, దిగుబడి బాగా వస్తోందని, రసాయనాల కన్నా ఘన, ద్రవ జీవామృతంలతో ఎనీ టైం మనీ (ఏటీఎం) పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా ఆదాయం పొందుతూ వస్తున్నామని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే నేల సారవంతమవుతుందని, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పొందవచ్చని, వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పెంపొందుతుందని ప్రభుత్వ సలహాదారు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అందుకే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగే చేసే రైతులు డాక్టర్‌లాంటివారని కొనియాడారు. ప్రకృతి వ్యవసాయంతోనే జీవరాశుల మనుగడ సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట వేసి పోత్సహిస్తోందన్నారు. రైతులు అంతర పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ హనుమంతరెడ్డి, ఎస్ఎఫ్ఏ సురేష్, డీఎంఎం నవీన్‌షా, దుర్గాదేవి, ఎల్‌వన్‌లు పెద్దిరెడ్డి, కుళ్లాయప్ప, సీఆర్‌ఎస్పీ రమేష్, ఎంపీఏ వెంకటేశులు, రైతులు పాల్గొన్నారు.



చోళసముద్రంలో వేరుశనగను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ప్రభాకర్‌రెడ్డి

జెడ్పీ అధికారుల తీరుపై ఉద్యోగుల నిరసన

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ ముఖ్య అధికారుల తీరుపై జెడ్పీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు నాగేంద్రకుమార్, లెక్కల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిరసన తెలిపారు. అధికారులు మహిళా ఉద్యోగినులతో అర్ధరాత్రి వరకు పని చేయించుకుంటున్నారని, సెలవుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారని, సంబంధం లేని ఫైళ్లపై సంతకాలు పెట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. తొలుత డిప్యూటీ సీఈఓ లలితాబాయిని కలిసి సమస్యలు మొరపెట్టుకున్నారు. ఆమె సూచన మేరకు సీఈఓ నిదియాదేవిని కలిసేందుకు గంట సేపు ఎదురు చూశారు. అయితే ఇద్దరు, ముగ్గురు మాత్రమే వచ్చి తమ సమస్యలను చెప్పాలని సీఈఓ సూచించడంతో ఉద్యోగులు మరింత అసహనానికి గురయ్యారు. తమకు న్యాయం చేయాలని దాదాపు 80 మంది ఉద్యోగులు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులెవరికీ సెలవులు ఇవ్వకూడదంటూ వచ్చిన ఉత్తర్వులు తమకు వర్తించవని, అయినా ముఖ్య అధికారి మాత్రం జెడ్పీ ఉద్యోగులకూ వర్తిస్తుందంటూ చెప్పడం ఏమిటో అంతుబట్టడం లేదన్నారు. ఒకట్రెండు రోజుల్లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కూడా కలసి తమ సమస్యలను విన్నవించనున్నట్లు జెడ్పీ ఉద్యోగ సంఘం ప్రతినిధులు తెలిపారు.



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం: ఇంజినీరింగ్ విద్యార్థి రెండు సబ్జెక్టులు ఫెయిలైనందుకు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... అశోక్ నగర్‌కు చెందిన కె.మురళీధరరావు కుమారుడు కరణం గంగాధరరావు (20) ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు వచ్చాయి. రెండు సబ్జెక్టులు ఫెయిలవడంతో మనస్తాపం చెందిన గంగాధరరావు శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు.

విద్యుదాఘాతంతో బేల్దారి మృతి

రాయదుర్గం రూరల్: మెచ్చిరి గ్రామంలో భవన నిర్మాణ పనులు చేస్తున్న బేల్దారి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కర్ణాటకలోని అశోకసిద్ధాపురం గ్రామానికి చెందిన పులకుర్తి గంగప్ప కుమారుడు పులకుర్తి గోవిందు (33) బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. శనివారం రాయదుర్గం మండలం మెచ్చిరి గ్రామానికి చెందిన నాగరాజు ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. మిద్దెపై విద్యుత్ తీగలు గమనించకుండా ఇనుప కడ్డీని పైకెత్తాడు. ఆ కడ్డీ విద్యుత్ తీగలు తగలడంతో గోవిందు షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నూర్‌మహమ్మద్ తెలిపారు.

నవ వధువు ఆత్మహత్య

గార్లదిన్నె: మర్తాడులో నవ వధువు గాయత్రి (20) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుబ్బన్న, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె గాయత్రి (20)కి ఈ నెల 11న పెద్దవడుగూరు మండలం కండ్లగూదూరుకు చెందిన జేసీబీ ఆపరేటర్ గణేష్‌తో వివాహమైంది. గాయత్రి శుక్రవారం ఉదయం నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. రాత్రి భరించలేని విధంగా నొప్పి రావడంతో ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారకస్థితిలోకి చేరుకున్న ఆమెను కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి అర్ధరాత్రి వేళ గాయత్రి ప్రాణం విడిచింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేశారు.



మృతురాలు గాయత్రి

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఒకరు..

కళ్యాణదుర్గం రూరల్: మద్యానికి డబ్బు ఇవ్వలేదని భార్యతో గొడవపడి వర్లి గ్రామానికి చెందిన హరిజన రామాంజనేయులు (55) శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చిగురుచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రైలుకిందపడి మరొకరు..

తాడిపత్రి: తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి (40) రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల నుజ్జునుజ్జయ్యిందని, తెల్లరంగుపు ఎరుపై గీతలు కలిగిన చొక్కా, సిమెంటు కలర్ లుంగీ ధరించాడని రైల్వే జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు. సంఘటన స్థలానికి కొంత దూరంలో కళ్లజోడు లభించిందన్నారు. మృతుడు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే బీసీల అభ్యున్నతి


మాట్లాడుతున్న బీసీ రమేష్‌గౌడ్

అనంతపురం ఎడ్యుకేషన్: సంక్షేమ ప్రదాత, రాయలసీమ ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకకోసం రాయలసీమ జిల్లాల్లోని ప్రజలు ఎదురు చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన రాప్తాడు ‹సిద్ధం› సభ వద్ద మీడియాతో మాట్లాడారు. బీసీలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తే.. జగనన్న అక్కున చేర్చుకుని సామాజికంగా, రాజకీయంగా అందలం ఎక్కించారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్‌బోన్ క్లాసెస్ అని నిరూపించారన్నారు. బీసీలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రతి పేదవాడి సంక్షేమం, అభివృద్ధి కోరిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కులాలు, మతాలు, పార్టీలు అనేది చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. జగన్‌కు మద్దతుగా నిలిచేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కటకటాల్లోకి ఇంజినీరింగ్ విద్యార్థులు

అనంతపురం: ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు దొంగలుగా మారి కటకటాలపాలైన ఘటన చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న సోమశేఖర్ నాయుడు, పృథ్వీరాజ్, లోకేశ్ కుమార్‌రెడ్డి రెడ్డి అనే విద్యార్థులు కలసి చోరీకి పన్నాగం పన్నారు. కొరియర్ వచ్చిందనే నెపంతో ఎల్‌ఐసీ కాలనీలో నివాసం ఉంటున్న అనంతలక్ష్మి అనే వృద్ధురాలి మెడలో బంగారు చైన్ లాక్కెళ్లారు. దీనిపై జనవరి 27న కేసు నమోదైంది. బాధితురాలు అనంతలక్ష్మికి బంధువులైన పృథ్వీరాజ్, సోమశేఖర్ నాయుడు, లోకేశ్ రెడ్డిని చోరీకి ప్రోత్సహించారు. అనంతలక్ష్మి కుమారులు అమెరికాలో ఉన్నారని, ఇక్కడ ఎవరూ లేరని పేర్కొని బంగారు చైన్ దొంగలిద్దామని పన్నాగం పన్నారు. నిందితులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులు అధికం కావడంతో ఈ ముగ్గురు చోరీలకు పాల్పడ్డారు.

బీజేపీ పాలనలో ముస్లింలకు భద్రత కరువు


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్: బీజేపీ పాలనలో ముస్లింలకు భద్రత కరువైంది. బీజేపీ దాని మిత్ర పక్షాలు విభజించు పాలించు సూత్రాన్ని పాటిస్తూ కక్ష దోరణితో వ్యవహరిస్తున్నారని పలువురు ముస్లిం మతపెద్దలు విమర్శించారు. శనివారం ముస్లిం ఉలేమాలు, మత పెద్దలు, నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఐ నాయకులు జాఫర్ తదితరులు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గోషా ఎమ్మెల్యే రాజా సింగ్ ముస్లింలను టార్గెట్ చేస్తూ ఎన్నో సార్లు దుర్భాషలాడుతున్నా అతనిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. కార్యక్రమంలో హఫీజ్ గౌస్‌పీర్, హఫీజ్ గులాం రసూల్, హాజీ జాఫర్, మౌలానా కుషాల్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢ నమ్మకాలను విడనాడాలని ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి సైన్స్ కళాయాత్ర కార్యక్రమం జరిగింది. జేవీవీ నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మూఢనమ్మకాలు లేని, శాస్త్రీయ దృక్పథం కలిగిన భారత దేశాన్ని నిర్మించుకుందామన్నారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు ప్రోత్సహించేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎల్ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో ఉన్నటువంటి అశాస్త్రీయ భావాల వల్ల విద్యార్థినులకు ఏ షయంలోనూ స్వేచ్ఛ ఉండదన్నారు. కుటుంబాల్లో మూఢ నమ్మకాల వల్ల మహిళలకు సర్జరీ తర్వాత పౌష్టికాహారాన్ని దూరం పెట్టి ఎలాంటి పోషకాలు లేనటువంటి ఆహారం పెడుతున్నారన్నారు. ఫలితంగా అనేక ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్, రాష్ట్ర స్థాయి సైన్స్ కళాయాత్ర కన్వీనర్ త్రిమూర్తులు, మురళీధర్, విశ్రాంత అధ్యాపకులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, నాయకులు గాంగే నాయక్ లక్ష్మీ నారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం


గొందిరెడ్డిపల్లిలో సిద్ధం సభకు ప్రజలను ఆహ్వానిస్తున్న నాయకులు

రాప్తాడు: రాప్తాడు ఆటో నగర్ సమీపంలో జరిగే ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభను జయప్రదం చేద్దాం. సీఎం జగనన్నను మరోసారి గెలిపించుకుందామని ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, సిద్ధం సభ మండల ఇన్‌చార్జి చిర్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పిలుపునిచ్చారు. రాయలసీయ జిల్లాలు కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల వైఎస్సార్‌సీపీ సన్నాహక సభ 'సిద్ధం' బహిరంగ సభను జయప్రదం చేయాలని పలు పంచాయతీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మైండ్ గేమ్‌లో భాగంగా ప్రభుత్వంపై వారి అనుకూల పత్రికలు, మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. వీరెన్ని కుట్రలు పన్నినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా విద్య, వైద్యం, ఇళ్ల స్థలాల పంపిణీ, పెన్షన్స్ అందించడం జరిగిందన్నారు. రూ.3.50 లక్షల కోట్లు నగదును వివిధ పథకాల రూపంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు కుల, మత వర్గాల, ప్రాంతాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని వెల్లడించారు. వైనాట్ 175 లక్ష్య సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు.

రామచంద్ర ప్రసాద్‌కు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో పరిశోధన చేసిన జి.రామచంద్ర ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ముత్యాలనాయుడు పర్యవేక్షణలో 'ఈఆర్‌పీ అప్లికేషన్ ఆన్ ఛేంజ్ మేనేజ్‌మెంట్ (విత్ స్పెషల్ రెఫరెన్స్ టు ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా) అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

ఆకట్టుకున్న ఆ పాత మధురాలు


హైదరాబాద్ కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: గంధర్వ గాయకుడు ఘంటసాల వర్ధంతి సందర్భంగా శనివారం రాత్రి అనంత వేదికగా సాగిన సంగీత విభావరి అందరినీ అలరించింది. హైదరాబాద్‌కు చెందిన రెట్రోరాగాస్ కల్చరల్ అసోసియేషన్ వారు నగరానికి చెందిన పాత పాటల సమూహం సౌజన్యంతో నిర్వహించిన విభావరిలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కళాకారులు, గాయనీ గాయకులు విచ్చేసి ఆ పాత మధురాలతో ఆకట్టుకున్నారు. పాపాప్రే (పాత పాటల ప్రేమికుల సమూహం) అధ్యక్షుడు ఓబుళదాసు, నిర్వాహకులు ఘంటసాల రామయ్య నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో శతాధిక గళగాన వినోదిని బిరుదాంకితురాలు అఖిల, దుర్గాప్రసాద్, రవీందర్, నాగేశ్వరరావు, ఓరుగంటి శ్రీమయి తదితరులు పాత సినిమాల్లోని పాటలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధి కేవీరావ గాయనీగాయకులు జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ జేఏసీ చైర్మన్ చంద్రమోహన్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, కార్మిక, పింఛన్ల దారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, సిరాజుద్దీన్, యూటీఎఫ్ నాయకులు లింగమయ్య, ఎస్టీయూ నాయకులు సూర్యుడు, ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌బాబు, నాయకులు లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్ర, హరి, సూరిబాబు, రవికుమార్, జమీలా బేగం, ప్రవీణ్ కుమార్, అజయ్, శోభారాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దళితుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం టవర్‌క్లాక్: దళితుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ కోరారు. శనివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుగుంటలో 41వ సర్వే నంబర్‌లో 278 పట్టాలను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు 2010లో ఇచ్చారన్నారు. అయితే స్థలాన్ని కొంతమంది నాయకులు కబ్జా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, మాల మహానాడు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అంబేద్కర్ హక్కుల పోరాట సమితి నాయకులు గోవిందు, దళిత సంఘర్షణ పోరాటి సమితి జిల్లా అధ్యక్షులు రాము, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న పెద్దన్న, ఉమా మహేశ్వరి, యల్లన్న, మాధవ్ పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు కోరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికల్లో మాదిగలకు 15 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలు కల్పించే పార్టీలకే మద్ధతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జెన్నే చిరంజీవులు, నాయకులు రామాంజనేయులు, హనుమంతు, రాఘవ, సుదర్శన్, నాగేంద్ర, పాలవాయి సుధాకర్, వన్నూరుస్వామి, రమేష్, ఏసన్న, సుధాకర్, స్వామిదాసు, రాముడు, కేపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యాసంస్థలు 2024–25 సంవత్సరానికి చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చందు, నగర ఉపాధ్యక్షులు హరికృష్ణ, రారాజు పాల్గొన్నారు.

డీఈఓను కలసిన అపుస్మా నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.వరలక్ష్మిని శనివారం ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రైవేట్ స్కూల్స్ యజమానులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు డీఈఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, కోశాధికారి ఇక్బాల్ అహ్మద్, గౌరవ అధ్యక్షుడు నాయుడు, అనంతపురం నగర కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్, కోశాధికారి అన్వర్, నాయకులు మధుసూదన్ రెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మన్న, రఘునాథరావు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కనగానపల్లి/రామగిరి/ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు నియోజకవర్గంలో మండల కమిటీల నియామకాన్ని చేపట్టారు. కనగానపల్లి వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడుగా టీ.అమరనాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా బీసీ ముత్యాలు, ఎం.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, శ్రీనివాసులు, నాగరాజు, కార్యదర్శులుగా నాగభూషణ, రామ్మోహన్‌రెడ్డి, నరసింహులు, రామచంద్ర, రామ్మోహన్, ట్రెజరర్‌గా రమేష్ , మరో 15 మందిని సభ్యులుగా నియమించారు. చెన్నేకొత్తపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా జీ.నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులుగా పీ.జలప్ప, ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బొగ్గు ప్రసాద్, శ్రీరాములు, కుళ్లాయప్ప, కార్యదర్శులుగా ఎం.భాస్కర్, లింగమయ్య, శివయ్య, ఎం.హరికుమార్‌రెడ్డి, పి.ఆదినారాయణరెడ్డి, ట్రెజరర్‌గా అంజి, 15 మందిని సభ్యులుగా నియమించారు. రామగిరి మండల కమిటీ అధ్యక్షుడిగా కర్రా హనుమంతరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా నాగరాజు, రాజేంద్ర, జనరల్ సెక్రటరీలుగా బిసి.వెంకటేష్, బి.చిరంజీవి, ఆదినారాయణ, సెక్రటరీలుగా అనిల్ కుమార్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశులు, కాంతప్ప, చెక్రిరెడ్డి, ట్రెజరర్‌గా భాస్కర్‌రెడ్డి, మెంబర్లుగా మరో 15 మందిని నియమించారు. ఆత్మకూరు మండల కమిటీ అధ్యక్షుడిగా పూజారి లక్ష్మీనరసింహులు, వైస్ ప్రెసిడెంట్లుగా ఈశ్వరరెడ్డి, మురళి, జనరల్ సెక్రటరీలుగా బాబయ్య చౌదరి, వెంకటేశులు, సుబ్బర బాలకృష్ణ, సెక్రటరీలుగా శివారెడ్డి, బుట్టా ఎర్రిస్వామి, గోపాల్, నాగరాజు, విశ్వనాథ్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా 17 మందిని నియమించారు.

రమేష్ నారాయణ రచనలు విభిన్నం


రమేష్ నారాయణ రచించిన పుస్తకాలను గ్రంథాలయాధికారులకు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: అనంత సాహితీక్షేత్రంలో రమేష్ నారాయణ శైలి విభిన్నంగా సాగుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అన్నారు. సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ రచించిన 'దార్శనికుడు డాక్టర్ ఉమర్ ఆలీషా' దివంగత రచయిత జూపల్లి ప్రేమ్‌చంద్ జీవిత చరిత్ర పుస్తకాలను శనివారం జిల్లా రచయితలు, సాహితీ సంస్థల ప్రతినిధులు తోట నాగరాజు, రియాజుద్దీన్, సుంకర రమేష్, ఆశ్రయ కృష్ణారెడ్డి, నాగశివ తదితరులు గ్రంథాలయాధికారులకు అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ మాట్లాడారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలిపే ప్రచార కార్యక్రమం ముమ్మురంగా సాగుతోందన్నారు. అందరి రచయితలు, కవులు, సాహితీపోషకులను భాగస్వాములు చేస్తున్నామన్నారు. ఎన్నో విలువైన గ్రంథాలు గ్రంథాలయంలో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఇంతియాజ్, కావేరి, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.